క్లుప్తంగా

అదనపు ఏపీపీగా బాధ్యతలు స్వీకరణ



తెనాలి రూరల్: తెనాలి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఏపీపీగా తెనాలి ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న శివలీల అనంతపురం పీటీసీకి శిక్షణ నిమిత్తం వెళ్లారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుకి మూడున్నర నెలలు సునీల్ కుమార్ ఏపీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

లక్ష రుద్రాక్షలతో శివపూజ

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో సోమవారం మహాశివునికి లక్ష రుద్రాక్షలతో బాల స్వామిజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శివునికి అభిషేకాలు, దీపోత్సవం భక్తులు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య దంపతులు, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, చుండూరు లోకనాధం, లలితా సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టిప్పర్లకు జరిమానా

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో ఇసుకను తరలిస్తున్న టిప్పర్ల యజమానులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర వద్ద తెనాలి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం, సిబ్బంది ఆకస్మిక వాహన తనిఖీలను సోమవారం నిర్వహించారు. అధిక లోడుతో వెళుతున్న రెండు టిప్పర్‌లను గుర్తించి వాటి యజమానులకు రూ.14 వేల చొప్పున జరిమానా విధించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

తెనాలి రూరల్: వరకట్న వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ నాజరుపేటకు చెందిన వెంకటదుర్గకు దుగ్గిరాల మండలం చింతలపూడికి చెందిన వెంకటగోపితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. అయితే తన భర్త కొద్దిరోజులుగా వరకట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు సోమవారం నమోదు చేశారు.

క్లారినెట్ విద్వాంసుడికి సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం దక్షయజ్ఞం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం పెళ్లి చేసి చూడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ క్లారినెట్ విద్వాంసుడు గానుగపెంట రంగనాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొల్లిపర రాఘవేంద్రరావు, పూసపాటి వెంకటేశ్వర్లు, ఈదర వెంకటపూర్ణచంద్, కె.చంద్రం, రావూరి హరీష్, శాఖమూరి చలపతిరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని,ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, ఉమ్మలనేని ధర్మారావు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.10 లక్షల ఆదాయం

తెనాలిఅర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని గోవాడ, క్వారీలకు ప్రత్యేక బస్సులను శని, ఆదివారాల్లో నడిపినట్లు, దాని ద్వారా రూ.10.15 లక్షల అదనపు ఆదాయం సమకూరిందని ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. గోవాడకు 28 బస్సులు, క్వారీకి 25 బస్సులు నడిపినట్లు చెప్పారు. గత ఏడాది రూ.7.58 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది మరింత పెరిగిందన్నారు.

విద్యుదాఘాతంతో బిల్ రీడర్ మృతి

పెదగొట్టిపాడు(ప్రత్తిపాడు): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఒక బిల్ రీడర్ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన బత్తుల రాజశేఖర్ (30) విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన బిల్ రీడర్‌గా పని చేస్తున్నాడు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామస్తులు భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి కోటప్పకొండ తిరునాళ్లకు తరలించారు. తిరిగి వచ్చే క్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా గ్రామ ప్రధాన రహదారిలోని విద్యుత్ పోల్స్ నుంచి సర్వీస్ వైర్లను తప్పించి సరఫరాను నిలిపివేస్తారు. మరలా ప్రభ తిరిగి గ్రామానికి చేరుకున్న తర్వాత విద్యుత్ శాఖ సిబ్బంది సర్వీస్ వైర్లును యథాస్థానంలో ఉంచి ఇళ్లకు సరఫరాను పునరుద్ధరిస్తారు. అయితే, ఈ ప్రక్రియ అంతా సంబంధిత విద్యుత్ శాఖ లైన్‌మెన్లు, హెల్పర్లు చేయాలి. కానీ గొట్టిపాడులో లైన్‌మెన్లు, హెల్పర్లు కాకుండా ఈ తతంగాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు, బిల్ రీడర్లుతో చేయించారు. అందులో భాగంగానే రాజశేఖర్‌తో పాటు మరో బిల్ రీడర్ సర్వీస్ వైర్లు పోల్‌కి అనుసంధానం చేస్తున్నారు. అదే సమయంలో ఇంట్లో సర్వీస్ వైర్లు కలుపుతున్న సమయంలో ఇన్వర్టర్ ఆన్‌లో ఉండటంతో రాజశేఖర్‌కు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. విద్యుత్ పోల్‌పైన ఉన్న మరో బిల్‌రీడర్ గమనించి స్థానికులకు తెలియజేయడంతో రాజశేఖర్‌ను స్థానికంగా ఉన్న ఒక ఆర్‌ఎంపీ వద్దకు, అనంతరం ప్రత్తిపాడు ఆరోగ్య కేంద్రానికి తీసుకు రాగాఅప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

సమన్వయంతో కలసి పనిచేయండి

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- గృహ సారథులు, వలంటీర్లకు ఎమ్మెల్యే శివకుమార్ సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్ (ఇన్‌సెట్‌లో) హాజరైన గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు

కొల్లిపర: ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. స్థానిక అవుతురామిరెడ్డి కళాశాలలోని గాదెసుబ్బారెడ్డి కళావేదిక పై మండల జేఏసీ కన్వీనర్ అవుతు శేఖరరెడ్డి అధ్యక్షతన మండలానికి చెందిన గృహ సారథులు, కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వంటీర్లతో జగనన్నే మా భవిష్యత్ పేరుతో చేపట్టనున్న ఇంటింటి ప్రచారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి వివక్షత లేకుండా పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. అన్ని పార్టీల వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని వివరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు సంక్షేమానికి లక్ష 86 వేల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసి 86.5 శాతం ప్రజలకు సంక్షేమం అందించిన ఘటన ముఖ్యమంత్రి జగనన్నకు మాత్రమే దక్కిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఇప్పటి వరకు ఆయా గ్రామాలల్లో ప్రభు త్వం చేసిన అబివృద్ధి, పథకాలు అమలుపై గృహసారథులు, కన్వీనర్లు ప్రజల వద్ద నేరుగా వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మళ్లీ జగనన్న సీఎం కావాలనే సంకల్పంతో మనమంతా సైనికుల్లా పని చేయాలని తెలిపారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గంలో 175 స్థానాల్లో పార్టీ గెలిపించి మరల సంక్షేమ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. మార్చి 1వ తేదీన వృద్ధులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌ను వలంటీర్లులతో కలసి గృహ సారథులు ప్రజలను పరిచయం చేసుకొని పింఛన్ అందజేయాలన్నారు. గృహ సారథులు మార్చి 18 నుంచి ఎనిమిది రోజు లు పాటు వారికి కేటాయించిన ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో ఉన్న తేడాలను వివరిస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏదైనా లోపంతో అందకపోతే పరిష్కరించేలా చూడాలని ఆసమస్య వారివల్ల కాక పోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు పోవటం వారి వల్ల కూడా కానిపక్షంలో నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గృహసారధులు ప్రజలకు, ప్రభుత్వానికి రథ సారధులుగా పని చేయాలని కోరారు. తొలుత జగనన్నే మా భవిష్యత్ అనే కార్యక్రమం సంబంధిత వీడియోల్ని ప్రదర్శించి పూర్తిస్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, మండల జేఏసీ కన్వీనర్ అవుతు శేఖరరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ఆరిగ చంద్రారెడ్డి, తెనాలి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, నగేష్‌రెడ్డి, సర్పంచి పిల్లి రాధిక, వైస్ ఎంపీపీ-2 అద్దంకి బోసుబాబు, వంగా సుధాకర్‌రెడ్డి, పార్టీనాయకులు కళ్ళం వెంకటప్పారెడ్డి, కళ్ళం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజు, సర్పంచులు, ఉపసర్పంచులు అవుతు పోతిరెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, దేశబోయిన నాగపునేశ్వరరావు, చందుబాబురావు, సిద్ధిల చంద్రబోస్, డి.రత్నబాబు, అంబటి సంధ్యాదేవి, ఎంపీటీసీలు చిలువూరి ఝాన్సీ, కె.శ్రీలత, మర్రెడ్డి మాధవి వివిధ గ్రామాల పార్టీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రహంతుల్లా



విద్యార్థులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి రహంతుల్లా

తెనాలి రూరల్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని 1వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మహ్మద్ రహంతుల్లా విద్యార్థులకు సూచించారు. స్థానిక కొత్తపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గహాన్ని న్యాయమూర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి భోజన శాల, వాషింగ్ ఏరియాలను తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి వసతి గృహంలో బస చేస్తున్న విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని న్యాయమూర్తి స్వయంగా తిని పరిశీలించారు. అలాగే వసతి గృహంలో మరుగుదొడ్లకు, స్నానాల గదులకు తలుపులు లేకకపోవడం గమనించి వాటిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ, చెడు స్నేహాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలన్నారు. సమాజంపై సరైన అవగాహన కలిగి ఉండాలని, సామాజిక మాధ్యమాల వినియోగం పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని, సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని సూచించారు. అదే విధంగా చట్టాలపై అవగాహన కలిగి సరైన మార్గంలోనే నడవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులతో పాటు దేశానికీ పేరు ప్రఖ్యాతులను తెచ్చే విధంగా నడుచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యుఓ జి.శైలజ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫే ఆఫీసర్ జయప్రద, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ నిరీక్షణరావు, గురుకుల వసతి గృహ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనంద్, వన్ టౌన్ సిఐ కె.చంద్రశేఖరరావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ పొదుపుగా వాడాలి




వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చిరంజీవి

తెనాలిటౌన్: ప్రస్తుతానికి విద్యుత్ సరఫరాకు కొరత లేదని, వేసవి కాలంలో విద్యుత్‌ను వినియోగదారుల పొదుపుగా వాడుకోవాలని ఎస్‌పీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి కోరారు. చెంచుపేటలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో వినియోగదారుల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఈఈ చిరంజీవి మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుకు ఏఈలు అంచనా వేయాలని సూచించారు. వేసవి లోడ్ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకోవాలని, వీటికి సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఎంసీసీ బాక్స్‌లు మారుస్తున్నామని, ట్రీ కట్టింగ్, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నామన్నారు. దెబ్బతిన్న మీటర్లను కూడా మారుస్తున్నామని వినియోగదారులకు సమస్యలు ఉన్నట్లయితే అధికారులను సంప్రదించాలన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించేందుకు వినియోగదారులు సహకరించాలని ఈఈ చిరంజీవి కోరారు. సమావేశంలో డీఈ అశోక్‌కుమార్, ఏఈలు లక్ష్మీనారాయణ, బి.శ్రీనివాసరావు, సి.హెచ్.వసంతరావు, ఇస్మాయేల్ బేగ్, అసిస్టెంట్ ఏఈ లీలావతి, సబ్ ఇంజనీర్ నీరంజన్, జెఏఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడకు తాగునీటిని అందివ్వాలి

కొలకలూరు వాసుల విజ్ఞప్తి



కార్యదర్శి విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని దళితవాడకు కొత్త పైపులైన్‌లను ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని ప్రజలు అధికారులను కోరారు. మంచినీటి పైపుల ద్వారా మురుగు నీరు వస్తున్నాయని, సోమవారం నంది వెలుగు, గుంటూరు రహదారిపై గ్రామ సెంటర్‌లో గంటసేపు రాస్తారోకో చేశారు. రూరల్ ఎస్ఐ సి.హెచ్.వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడారు. ఎస్ఐ ఫోన్ ద్వారా తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీవో విజయా లక్ష్మణ్‌లతో మాట్లాడారు. సంఘటన స్థలానికి పంచాయతీ కార్యదర్శి పి.విద్యాసాగర్ చేరుకుని వారితో చర్చలు జరిపారు. కుళాయిలు బాగు చేయిస్తామని, మంచినీరు అందని వారికి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ఉన్నం జాన్‌బాబు, కోపల్లె శ్రీనివాసరావు, గొరికపూడి బుజ్జి, సుద్దపల్లి రవిబాబు, పంచాయతీ మెంబర్లు కొలకలూరి అరుణ, సొపాటి కోటేశ్వరి, మోదుకూరి దావీదు, సుద్దపల్లి స్వరూప, పోలంటి దాసు, సుద్దపల్లి పృథ్వి, కొలకలూరు సత్యనంద్ పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన

గ్రామంలోని దళితవాడను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సందర్శించారు. తాగునీటి కుళాయిలను, మురుగునీరును పరిశీలించారు. అనంతరం జగనన్న కాలనీలను సందర్శించారు. గ్రామ సర్పంచ్ చొప్పరప్రీతి అధికారులకు త్రాగునీటి సమస్యను గురించి వివరించారు. జగనన్న కాలనీలో స్థలం చూపించినట్లయితే కొత్త ట్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీపీవో కేశవరెడ్డి, డీఎల్‌పీవో శ్రీనివాస్ నాయక్, ఈవోపీఆర్డీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్‌లు ఉన్నారు.

నేడు తెలుగు భాషోద్యమ సమాఖ్య వార్షికోత్సవం

తెనాలి: తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, సమాఖ్య 20వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. సమాఖ్య తెనాలి అధ్యక్ష, కార్యదర్శులు సామల లక్ష్మణబాబు, యర్రంశెట్టి హనుమంతరావు సోమవారం తెలిపారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కాలేజి సభా మందిరంలో మధ్యాహ్నం మూడు గంటలకు విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, ఆచార్య జోగాసింహ్(పంజాబ్), ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ హాజరవుతారని వివరించారు. వ్యాసాలు, ప్రసంగాలు, లఘుచిత్రాలు-పోటీల ప్రకటన పోస్టర్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 'అమ్మ నుడి' సంపాదకీయాల సమాహారం' పుస్తకం ఆవిష్కరణ, వలగూడు (వెబ్‌సైట్)ను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

గుంటూరు కాల్వను విస్తరించాలి

పెదనందిపాడు: గుంటూరు చానల్ విస్తరణకు నిధులు కేటాయించి, పనులు మొదలు పెట్టాలని నల్లమడ రైతు సంఘం నాయకులు ఇరిగేషన్ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. సోమవారం గుంటూరులో జరిగిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు అర్జీని సమర్పించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ.. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉన్నాతాధికారులు స్పందించి భూ సేకరణకు నిధులు కేటాయించేలా చొరవచూపాలని ఆయన కోరారు.

మారిటైమ్ విద్యాసంస్థలో తెనాలి యువకుడికి సీటు

- ఇంటర్నేషనల్ లాజిస్టిక్స్, అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్సీ ప్రోగ్రాంకు అర్హత
- ఇప్పటికే మెరైన్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్



ఎరిక్ ప్రకాష్ వర్మ

తెనాలి: అందరిలా ఆ యువకుడు 'సాఫ్ట్‌వేర్'కేసి చూడలేదు. ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్(అంతర్జాతీయ సముద్ర సంస్థ)లో జాబ్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆ దిశగా చదువు కొనసాగించాడు. కల నెరవేరేందుకు ఇంకొక్క అడుగు దూరంలోని మారిటైమ్ మేనేజ్‌మెంట్ స్కూల్లో సీటు సాధించాడు. అది కూడా... ప్రపంచంలో 20 ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ఒకదానిలో సుమా! రెక్కలు కట్టుకుని విమానంలో అక్కడ వాలడమే తరువాయి. విదేశీ విద్యాదీవెన లభించి తన కల నెరవేరుతుందని ఆశతో ఉన్నాడు. ఆ యువకుడి పేరు ఎడ్ల ఎరిక్ ప్రకాష్ వర్మ. సొంతూరు తెనాలి. ఇంటర్ వరకు ఇక్కడే చదువు. కాంజీపురం(చెన్నై) ట్రిపుల్ ఐటీలో డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ చేశాడు. ఆ వెంటనే కోల్‌కతాలోని డిఫెన్స్ షిప్ యార్డులో మెరైన్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ 2020లో పూర్తయింది. అదే ఏడాదిలో అయిల్ అండ్ గ్యాస్ ఇంజినీరింగ్ చదువుకని స్కాట్లాండ్ వెళ్లాడు. కరోనా విపత్కర పరిస్థితుల కారణంగా కొన్ని నెలల్లోనే తిరుగుముఖం పట్టాల్సి వచ్చింది. అంతర్జాతీయ సముద్ర సంస్థలో ఉన్నతోద్యోగం లక్ష్యంతో అవసరమైన కోర్సులను అన్వేషించటం, ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలకు దరఖాస్తు చేస్తూ గడిపాడు. ఫ్రాన్స్ లోని లేహావ్రి నగరంలోని ఎం.నోర్మాండి బిజినెస్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ లాజిస్టిక్స్, అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్సీ ప్రోగ్రాంకు సీటు లభించింది. మారిటైమ్ మేనేజ్‌మెంట్‌లో ఎం.నోర్మాండి బిజినెస్ స్కూల్ ప్రపంచంలోని 20 ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటిగా ఎరిక్ ప్రకాష్ వర్మ వివరించారు. యూ కే, యూరప్‌లో ఆరు క్యాంపస్‌లు ఉన్నాయని చెప్పా రు. ఇంతవరకు బాగానే ఉన్నా, వీసా, ప్రయా ణ ఖర్చులు, ఫీజులు, వసతి... అన్నీ కలిసి రూ.25- 30 లక్షల వరకు సమకూరటమే సమస్యగా తయారైందని అంటున్నాడు. ప్రైవేటు ఎయిడెడ్ కాలేజీలో అధ్యాపకుడిగా రిటైరైన తండ్రికి అంత స్తోమత లేదనీ, రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన విదేశీ విద్యాదీవెనతో తోడ్పడాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

'భవిత'కు మౌలిక సదుపాయాల కల్పనకు చేయూత

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వీల్‌చైర్లు బహూకరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: విభిన్న ప్రతిభావంతుల కేంద్రం 'భవిత'కు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హామీనిచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు, అక్కడి దివ్యాంగుల్లో మానసిక పరివర్తనకు దోహదపడే అంశాలను చేపట్టేందుకు కృషిచేస్తానని చెప్పారు. స్థానిక బాలాజీరావు పేటలోని భవిత కేంద్రానికి రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి అయిదు వీల్‌చైర్లను పంపిణీ చేయగా, హ్యాపీ హాస్పిటల్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో గల 17 కిటికీలకు రూ.50 వేల ఖర్చుతో అల్యూమినియం మెష్‌లు ఏర్పాటు చేయించారు.

ఎమ్మెల్యే శివకుమార్ చేతులమీదుగా వీటిని సోమవారం భవిత కేంద్రానికి అప్పగించారు. ఎమ్మెల్యే మాట్లాడారు. రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖను, హ్యాపీ హాస్పటల్స్ యాజమాన్యాన్ని అభినందించారు. వీరి స్ఫూర్తితో మరింత మంది దాతలు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలరు మొగల్ అహ్మద్, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్‌చైర్మన్ పి.రామచంద్రరాజు, హ్యాపీ హాస్పటల్ డాక్టర్ పావనీ ప్రియాంక, భవిత ఉపాధ్యాయిని సునీత, ఫిజియోథెరపిస్ట్ ఎం.శివనాగమల్లేశ్వరరావు, జయమ్మ పాల్గొన్నారు.

పురుగు మందుల గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు

గుంటూరు రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా పురుగు మందులు, ఎరువుల విక్రయాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గుంటూరు అర్బన్ - 2 వ్యవసాయ శాఖ అధికారి బి.కిషోర్ హెచ్చరించారు. సోమవారం ఏటుకూరు రోడ్డులోని చంబల్ ఫెస్టిసైడ్స్ కంపెనీలో ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. సంబంధిత గోదాం అద్దె రెన్యువల్ చేసుకోలేదని గుర్తించారు. అదేవిధంగా మిరిమి తయారీ లైసెన్స్ గడువు తీరిందని గుర్తించారు.

అయినా మార్కెటింగ్ చేస్తున్న కొన్ని కంపెనీల పురుగు మందులు గోదాంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గోదాంలోని స్టాకు మొత్తం విక్రయాలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ 1.58 లక్షల విలువ చేసే ఎరువులు, పురుగు మందులు ఉన్నట్లు తెలిపారు.


ధ్యాన యోగ మండలి వార్షికోత్సవం



భోజనం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న యోగమండలి సభ్యులు

తెనాలిటౌన్: శ్రీ ఆంజనేయం ధ్యానయోగ మండలి తెనాలిశాఖను ప్రారంభించి 18 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రామలింగేశ్వరపేటలోని యోగ మండలి కార్యాలయంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలను జరిపారు. యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ఆదేశాల మేరకు బోసురోడ్డు, బోసురోడ్డులోని వాసవీ సత్రం, గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రం, మారీసుపేటలోని చంద్రమౌళీశ్వర కల్యాణ మండపంలో వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ప్రకృతి ఉపాసన ధ్యాన కరపత్రాలను బూర్ల నరసింహారావు, గ్రంధి మాధవరావు, చుండూరు లోకనాథం, ఆర్‌ఎంపీ వైద్యులు సాంబశివరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు యోగసాధకులు బోసురోడ్డు, మారీసుపేట, రామలింగేశ్వరపేట, గంగానమ్మపేట, పాతశివాలయం సెంటర్‌లలో పేదలకు సంచార అన్నదాన కార్యక్రమాని నిర్వహించి భోజనం ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో యోగ మండలి సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, కోమల మాతాజీ, శాంతి, జానకీ భాయ్, గోవర్ధని, రాణి, రాంబాబు, గొడవర్తి సత్యనారాయణ, రమేష్, రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థులతో సాయికిరణ్, బాలకృష్ణరాజు

తెనాలిఅర్బన్: ఆల్ ఇండియ ఒపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో రూరల్ మండలం కఠెవరంలోని నివాస్ షిటో రియో కరాటే అకాడమీ విద్యార్థులు పలు పథకాలు సాధించారని కోచ్ కె.సాయికిరణ్ తెలిపారు. మచిలీపట్నంలో ఆదివారం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అండర్-19 విభాగంలో పి.సంజయ్ వర్మ, పి.భాగ్యశ్రీ, బి.కార్తీక్, బి.సాద్విక్‌లు ప్రథమ బహుమతులు, పి.హరినారాయణ రాజు, పి.సాంబశివరాజు, ఎస్.సంతోష్‌వర్మలు ద్వితీయ బహుమతులు సాధించినట్లు చెప్పారు. వీరికి మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కఠెవరం గ్రామ పెద్దలు కాశీరాజు బాలకృష్ణరాజు, కె.సాంబశివరాజు, పి.నటరాజు, పి.సాంబశివరాజు, కాశీరాజు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ జట్టులో దీప్తికి స్థానం



పాఠశాలలో దీప్తిని అభినందిస్తున్న హెచ్‌ఎం రాజారెడ్డి, పీడీలు రమేష్‌లు

తెనాలిటౌన్: జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్-14 బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని కెఎస్‌ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి, పిజికల్ డైరెక్టర్ జె.రమేష్‌లు సోమవారం తెలిపారు. జట్టులో పాఠశాలకు చెందిన ఎస్‌వీఎస్ దీప్తి చక్కటి ప్రతిభ కనబరచి స్థానం సంపాదించినట్లు తెలిపారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని దీప్తిని హెచ్‌ఎం రాజారెడ్డి, పీడీ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో ప్రథమస్థానం నిలవాలని ఆశీర్వదించారు.

మున్సిపల్ ఉద్యోగిపై డ్రైవర్ దాడి

తెనాలి రూరల్: మున్సిపల్ ఉద్యోగిపై కమిషనర్ కారు డ్రైవర్ దాడి చేయడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మున్సిపల్ కార్యాలయ పట్టణ ప్రణాళిక విభాగంలో పని చేసే ఉద్యోగిపై మున్సిపల్ కమిషనర్ కారు డ్రైవరు రవి, 17వ తేదీన దాడి చేసి గాయపర్చాడు. బాధిత ఉద్యోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

లలిత కళలపై అవగాహన సదస్సు



తెనాలిటౌన్: చెంచుపేటలోని నవచైతన్య కళామండలి సొసైటీ కార్యాలయంలో సోమవారం లలిత కళలపై అవగాహన సదస్సును నిర్వహించారు. పెయింటింగ్, ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం వంటి దృశ్య కళలపై వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పీటర్ థామస్ మాట్లాడుతూ కళాకారులు, చిత్రకారులు, విద్యార్థులు, మహిళలు అవకాశాన్ని ఉపయోగించుకుని తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలియజేశారు. లలిత కళలు, దృశ్య కళలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేయవల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో గొరికపూడి బాలరాజు, ప్రవీణ్‌పాల్, రాజేంద్రబాబు, షాలేమ్‌రాజు, పలువురు కళ బృందాల సభ్యులు పాల్గొన్నారు.